# ఆకాశ కుసుమాలు

"దరఖాస్తులు పెట్టినంత మాత్రాన డబ్బు శాంక్షనయిపోతే ఇన్ని పర్రాకులేల ? యీ కర్నమేల ? ఆ ఆరయ్యేల ? ఆ ఆర్డీవో యేల ?? ఆ ఆఫీసులన్నీ యేల ???

కరణాల సంగతొదిలే. యెలాగూ తీస్నారు. అయితొకటీ, కరణాలని తీస్సి యేదీ యేటి నడిసి పోతుంది ? పైయోళ్ళకి మేపడానికి యిప్పటికీ మా చేతులే కావాల ! ఆ ఆరయ్యికీ మేమే కావాల. ఈ కొత్తగొచ్చిన విలేజి అసిస్టెంటుకీ మేమే కావాల. అంతే మరందుగాబట్టీ ఇంతక మునుపు పాలించినోల్లు తెలివి తక్కువోల్లుగాదు మా ఊసెత్తుకోలేదు. ఉద్యోగాలాడబీకి లేదు.

చూసావా ! మరిప్పుడు ఈ కరణమే నీ ఫారాలు నింపాల. ఆ ఫారాల్ని ఆరయ్యికివ్వాల. ఆట్ని ఆరయ్యినుండి ఆర్డీవో బెంచీలదాకా తిప్పి పన్లు చేయించడానికి ఈ కర్నపోడుండాల.

నిజంవే ! అరవయ్యేళ్ల నిండి పోయిన, భూమిలేని వ్యవసాయ కూలీలకు పెన్షన్ ఇవ్వబోతున్నట్లు మంత్రిమండలి నిర్ణయించిందని రేడియోలల్లో చెప్పారు. పత్రికల్లోనూ ప్రకటించారు. మరా నిర్ణయం జీ. వో. కావాల ! ఆ జి. వో. ఇక్కడకు రావాల. ఇక్కడది అన్ని బెంచీలూ ఎక్కి దిగాల. అప్పుడూ - తాలూకాఫీసులో మన ఫారాల్ని

చూస్తారు. ఆ ఫారాలు కిందనో మీదనో మనం పెట్టిన బరువు చూస్తారు. మిమ్మల్ని రమ్మంటారు. మిమ్మల్నీ చూస్తారు. చూసి, ఏ రోజున మీకు పెన్షన్ ఆర్డర్లు ఇస్తారు !

ఇదీ కథ ! ఇంత కథ నడాల. అంతేగానీ మూడ్రోజుల కిందట ఫారాలెట్టి, అప్పుడే-"బావ్....పెన్షన్" అంటే నేనెక్కడ తెచ్చేది ? అదేటి పెనం మీది అట్టుకాదే....అట్ల కఱ్ఱ తోటి తీసిచ్చీడానికి !"

అని హాస్యోక్తిగానూ మాటాడి మళ్లీ వెంటనే –

"అయినా బెంగపడకు. కర్ణాలకు ఉద్యోగాలు పోయాయిగానీ, కలాలు పోలేదు. ఆ కలాలకు బలాలు పోలేదు. తాలూకాఫీసు నుండి కలెక్టరేటు దాకా మా కలాల కింగా పవరు బతికే వుంది. నీకేంభయంలేదు. నీకు పెన్షన్ తెప్పిస్తాను.

రేపీ వేళకి నువ్వు నాలుగు ఫొటోలు - నీవే - ఆఁ....నీ ఫోటోలు నాలుగు కాపీలు తీయించి తేవాల. అటితోపాటూ ఇరవయి రూపాయిలు అవును...ఇరవై వుండాలనా ! ఒక్కడి గుండానికి గాదు. ఆరయ్యీ నుండి ఆర్డీవోదాకా వున్నారు దూతలు. అందర్నీ సంతృప్తి పరచాల ! ఆఁ మరి మాట్లాడకు.

యేటి ? గుర్తుంచుకో. సరిగ్గా రేపు ఈ వేళకి నీ ఫొటోలు నాలుగు కాపీలూ, అటితోటి - నాలుగ్గైదులు...ఎంతవుద్ది ? ఎక్కాలొచ్చునా ? నీకేం ఎక్కాలొస్తాయిలే. నాల్రోజులు పోతే మా కరణాలూ మర్చిపోతారు. సర్లే, ఎల్లు, ఎల్లి రేపు యీ వేళకి నేన్చెప్పినది పట్టుకొని వొచ్చి... కనబడు...ఆఁ !" అని మరో మాట చొరనీకుండా, ఆమెకు అన్ని సంగతులూ చెప్పి ఇంట్లోకి వెళ్లి పోయాడు కర్ణం !

గంపెడాశతో కరణం గడపకొచ్చిన ఆ వృద్ధురాలు నిస్పృహతో వెనుదిరిగింది. నిరాశగా మోహనరావు యింటిముందు గడపమీద చతికిల బడింది.

నిరాశగా కూర్చున్న వృద్ధురాల్ని చూసి -

"ఏం మామ్మా ! కర్నం గారింటికి వెళ్లినట్లుంది. యేమన్నారాయన ? అయినా...చేయించగలనన్నాడా ?" అని అడిగాడు మోహనరావు

మోహనరావు ప్రభుత్వోద్యోగి. ఉద్యోగరీత్యా ఆ పల్లెలో వుంటు న్నాడు. బ్రహ్మచారైన ఆయనకు ఈ వృద్ధురాలే వంటావార్పూ చేసే వంటమనిషి, పనిమనిషి ! గత యేడాది నుండీ మోహనరావు చేసిన ప్రయత్నం ఫలించక, ఇక, మరి కరణమే శరణ్యమని....మామ్మను కర్నం దగ్గరికి పంపాడు.

ముసలి దానికి వెనకా ముందు లేనందున, బ్రతికి చెడినదయి నందున, నమ్మకస్తురాలయినందున మోహనరావుకి ఆమెమీద సానుభూతి వుంది. ఆ సానుభూతితోనే, ప్రభుత్వం యీ మధ్యనే ప్రకటించిన వ్యవసాయ కూలీల పెన్షన్‌కు దరఖాస్తు పెట్టమనీ, కరణాన్ని కలియమనీ చెప్పాడు.

మోహనరావు ప్రశ్నకు మామ్మ దీర్ఘంగా నిట్టూర్చి -

"మా నాయిన ఒక కథ చెప్పేవోడు. పూర్వం ఒక రాజుగారికి ఒక కొడుకున్నాడట. ఆ కొడుక్కి యేదో తీరని రోగమొచ్చి, యెన్ని వొయిద్యాలు చేయించినా ఫలితం దక్కలేదట. కొడుకు సచ్చిపోనాడట !

ఆ సమయంల యెక్కడ నుండో గంధర్వ వొయిద్యుడు ప్రత్యక్ష మయ్యాడుట....రాజుగారి యెదుట ! అయ్యో, ఓయ్ రాజా ! నీ కొడుకు బతుకుతాడు. కానీ, అందుకు 'ఆకాశ కుసుమాలు' కావాల - అన్నాడట.

అనగానే, ఓ...యిప్పుడే తెప్పిస్తాను. యెవరక్కడ ? అని బటుల్ని పిల్సినాడట రాజు !

అలా పిల్చిన రాజుగోరితో, ఆ గందర్వ వొయిద్యులు - ఆ ఆకాశ కుసుమాలు తెచ్చాక, అట్నే, ఆ రాజు కొడుకు ముక్కు దగ్గిట వుంచి వాసన పీల్పించండి - బతికిపోతాడు. అని చెప్పి, వొచ్చినట్లే మాయ మయ్యాడట గందర్వ వొయిద్యుడు !

ఆకాశానికి కుసుమాలెక్కడుంటాయి ? ఉండవు. ఒక వేళ ఉండే? వాటిని తెచ్చినా చచ్చిన రాకుమారుడు వాటిని వాసనెలాగ చూస్తాడు, ఊపిరుంటేగదా వాసన పీల్చేది ?

ఆ కథలాగా, ఆ గంధర్వ వొయిద్యంలాగా వుంది కర్నంగోరి మాట ! మూతిమీద గెంజికి నీ గిన్నేముంతా దోముకునే ఈ మొహాన్ని ఫొటోలు దియ్యించాలట ! ఆ ఫొటోలకెంత వుండాలో ? అవిగాక, ఆటితోటి యిరవయి రూపాయిలు లంచం యిచ్చుకోవాలట ! అప్పు డొస్తాదట పెన్షన్. ఆ ఫొటోలు నేనెక్కడ తీయించగల్ను ? ఆ ముడుపులు నేనెక్కడ చెల్లించగల్ను ? ఆ కర్నానికీ, కర్నం వొయిద్యానికీ ఓ దండ మెట్టేసినాను." అని చేతులెత్తి మొక్కేసి; కూచున్న చోటునుంచి లేచింది.

"అదికాదు మామ్మా ! తప్పదు. ఇంకా నయం. నీ పెన్షన్లో ఎల్లకాలమూ వాటా అడుగలేదు. అడిగినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఈ వ్యవస్థలో అది వింతకాదు.

నీలాంటి వృద్ధులు తమ అనుభవాలను నూతన తరాలకు అందిస్తూ, సమాజోత్పత్తిలో వీలున్నమేరకు పాల్గొంటూ, చీకూ చింతా లేకుండా—ప్రభుత్వం నడిపే—వృద్ధుల విశ్రాంతి హాస్టల్లో గడిపే వ్యవస్థే వస్తే ఎంత బాగున్ను !

సరేలే ! ఈ కలల కేం గానీ, రణం అడిగిన డబ్బులూ, ఫొటో ఖర్చులూ ఇస్తాను. ఫొటోలు తీయించుకొని, ఆయనకిచ్చి ఆ పెన్షన్ వచ్చేట్లు చూసుకో. ముసలిదానవు. కొంత జీవనాధారం ! అదీగాక, నాకు ట్రాన్స్ఫర్ అయ్యిందని చెప్పాను గదా ! రేపే వెల్లిపోతున్నాను." అని చెప్పి ఆమెకు డబ్బులిచ్చాడు.

మోహనరావు బదిలీతో ఆమెకు జీవనాధారం పోతుంది. పోనీ, ఆయనిచ్చిన డబ్బుల్తో కరణంచేత ఆ పెన్షన్ వొచ్చినట్లు చేయించుకుంటే కొంతలో కొంత మెరుగుగదా అని భావించింది మామ్మ !

కర్నం అడిగిన ప్రకారం ఫొటోలు నాలుగు కాపీలు ఇచ్చింది. నాలుగైదుల ఇరవై-రూపాయిలూ ఇచ్చింది.

"తప్పకా పెన్షనొచ్చేట్లు చూడాల నాయినా..." అనీ, నమస్కారాలూ ఇచ్చింది !

ఇచ్చినవన్నీ అందుకున్న కర్నం,

"వొస్తాది. ఎందుకు రాదు ? నేనున్నాను. నా కలమున్నాది. మరేం ఫరవాలేదు. నాదీ పూచీ !

అవును గానీ, నీకు భూమి పుట్టా....లేదు కదా ?" అని అడిగాడు.

"ఒకప్పు డుండీది..."

"ఇప్పుడ్లేదుగదా ! అయితే—లేదు—" అని ఆరయ్యీగారి సర్టిఫికేటుండాలి."

"ఇదొకటా...?"

"అవును. అదిగాక నీ భర్త వున్నాడా ?"

"....లేరు. చాన్నాళ్ల కిందటే చనిపోయారు."

"అలాగా ! అయితే, భర్తలేదు అనిగూడా సర్టిఫికేటుండాలి"

"అదెక్కడ దొరుకుతాది నాయినా ?"

"అవేటి అల్లి పళ్లనుకున్నావా దొరకడానికి! సరేలే, ఆ సర్టిఫికేట్ల గొడవేదో నేనే పడతాను. ఇదిగో యీ కాగితాల మీద వేలిముద్రలెయ్యి" అని కొన్ని కాగితాలు ఎక్కడ వేలిముద్ర లెయ్యాలో చూపిస్తూ ఇచ్చాడు కర్నం !

"సంతకం పెట్టగల్ను...." అందామె.

వింతగా చూస్తూ— "అయితే సంతకాలే చెయ్యి"— అని కలం ఇచ్చాడు.

వంకరటింకరగా సంతకాలు చేస్సి, కాగితాలిచ్చేసి, ఆఖరుసారిగా

"బాబూ! నీ పేరు చెప్పుకుని యీ నాల్రోజులూ బతుకుతాను. ముసిల్దాన్ని" అని మొక్కింది.

"ఫర్లేదు. వెళ్లెల్లు. నేను తెప్పిస్తాను గదా! మరి భయపడకు." అని కర్ణం హామీ యిచ్చి పంపేసాడు.

కరణం గారి హామీకి వారం రోజుల వయసొచ్చింది. ఈ వారంలో రెండు మూడు రోజులే తినగలిగింది. మిగిలిన రోజులు మంచినీళ్ల మాత్రమే తాగగలిగింది. నిన్నట్నుండీ అదీ తాగలేక, మంచం మీదనే కూలబడింది. తీవ్రమయిన చలి జ్వరంతో మూలుగుతోంది!

మూలుగుతున్న ముసలిదాన్ని తాలూకా కార్యాలయానికి తీసుకొచ్చాడు కరణం... పెన్షన్ దరఖాస్తు దారులందరితో పాటు!

* * *

చుట్టూ రావిచెట్లూ, తురాయి చెట్లూ, సరుగుడు చెట్లూ ఏపుగా పెరిగిన విశాలభూభాగం మధ్య...ఓ పురాతన భవంతి!

ఆ భవంతి పైకప్పు మీది పెంకులు నాచుపట్టి, పిచ్చి మొక్కలు మొలిచి, అక్కడక్కడా గోడలు సున్నం పెళ్లలు ఊడి తన శిథిల సౌందర్యాన్ని ప్రదర్శిస్తోంది.

ఆ భవనం ముఖద్వారం ఎదురుగా కొద్ది దూరంలో కడుపారతిని, త్రేన్చి, ముందుకాళ్లు చాపి పడుకున్న పులిలా ఆగివుంది నల్లటి జీపు!

పులి అక్కడే వుంది. ఖాలీగా వుంది. గనక పులిమీద స్వారీ చేస్తూ రాచకార్యాలు నిర్వహించే అధికారి ఆ భవంతి లోపల ఆఫీసులో వున్నారు!

భవంతి లోపల అనేక గదులున్నాయి. ఆ గదుల్లో అనేక కుర్చీలున్నాయి. వాటి ఎదురుగా బెంచీలున్నాయి. బెంచీలమీద ఫైళ్లున్నాయి. ఆ ఫైళ్లల్లో అనేకుల, అనేక వ్యవహారాలున్నాయి. ఆ అనేక వ్యవహారాలు ఎంతదాకా వచ్చాయో, వాట్ని చేర్చవలసిన గమ్యస్థానం చేర్చటానికి,

యెన్ని తంటాలు పడాలో ! అదిగో, ఆ తంటాలు పడేందుకు, ఆ అనేకులు, ఆ కుర్చీల వద్దకు వస్తూ, కుర్చీల్లోని ఉద్యోగులకు దండాలు పెడుతూ, బెంచీలమీది ఫైళ్లని ఆశగా చూస్తూ, బెంచీల కింద చెయ్యవలసిన యేర్పాట్లు చేస్తూ ఆశలను మూటగట్టుకుంటున్నారు !

ఆ అనేకుల ఆశల ఒయాసిస్సు అయిన ఆ భవంతే తాలూకా కార్యాలయం !

కర్నం తీసుకురాగా, ఆశతో ఒయాసిస్సు చేరిన ఆ వృద్ధురాలు చల్లగాలికి ఒణికిపోతూ, చెట్టు మొదలుకు చుట్టుకుపోయింది....మూలుగుతూ జ్వరంతో !

రెండు రోజులనుంచీ తిండిలేదు. ఒంట్లో సత్తువలేదు. ఒళ్ళు పేలిపోతోంది జ్వరంతో ! పెదాలు తడారిపోతున్నాయి. అక్కడి చెట్లూ చేమలూ కుర్చీలూ, బెంచీలూ, గదులూ మనుషులూ అన్నీ అంతా, జ్వరంతో తగలబడి పోతున్నాయనే అన్పిస్తోంది ఆమెకు. ఈ భావనలోనే ఆమె—చేదయిన తన గతంలోకి వెళ్ళింది.

ఆమెకు రెండేళ్ళ కిందట అరవయేళ్ళు నిండాయి. నలభైయేడేళ్ళ కిందట పెళ్ళయింది. పెళ్ళీడు వయసులో ఆమె సూర్యకుమారి ! కలవారి ఇంట పుట్టిన సూర్యకుమారి అరవయి తులాల బంగారం, అయిదెకరాల పల్లపు భూమితో అత్తవారింటి కొచ్చింది. అత్తవారు కన్నవారికంటే సంపన్నులు. అత్తా మామలు సాత్వీకులు. భర్త మాత్రం చాలాకాలం అర్థంకాలేదు. అర్థమయ్యే నాటికి హారతి కర్పూరంలా ఆస్తి కరిగి పోయింది. భర్తకు ప్రపంచంలో మూడే మూడు యిష్టమయినవీ, విలువయినవీ—తాగుడు ! జూదం !! వ్యభిచారం !!! ఈ సంగతి ఆమె గ్రహించే నాటికి, ఆస్తీ, భర్త, ఆరోగ్యం చమురింకిన దివ్వెలయినయి ! ఈ దివ్వెల మీద బెంగతో అత్తా, మామలు ఒకరి తర్వాత ఒకరు ఆరి పోయారు !

అత్తా మామలు ఆరిపోయిన అత్తవారిల్లు అడవిలా వుండేది సూర్యకుమారికి! రాత్రిళ్ళు యే వేళకో ఇల్లుజేరి—వరుసుమీద వాలిన స్పృహలేని భర్తను చూస్తూ...ఆ యింటిలో...తన ఒడిలో యేడాది బిడ్డడ్ని నిద్రపుచ్చుతూ, ఒంటరిగా, దిగులుగా, నిద్రకు వెలియై, రోజులు గడిపేది !

దాదాపు ఉన్న ఆస్తినంతా వ్యసనాల్లో తగులబెట్టి, అప్పుల్నే ఆస్తిగా మిగిల్చి ఓ రోజు కన్ను మూసాడు భర్త !

ఐశ్వర్యం పోవటమేగాక, వైధవ్యం రాగా, మేడనుండి గుడిసెకు తోడూ నీడా తొలగి కొడుకే సర్వస్వంగా మిగిలిన సూర్యకుమారి కూలీనాలీ చేసి కొడుకుని చదివించేది. కొడుకు చుట్టూ ఆశల్ని అల్లుకొనేది !

"అదృష్టాలు జంటగా రావు—కష్టాలు ఒంటరిగా రావు" అన్న సామెతలా సూర్యకుమారి ఆశలు...అడియాశలైనాయి !

విశాఖ ఉక్కు—కోసం ఉద్యమించిన సూర్యకుమారి కొడుకు పోలీసు కాల్పుల్లో అమరుడయ్యాడు. కొడుకు చితికి నిప్పు పెట్టిన సూర్యకుమారి గుండె మంట ఎన్నటికీ ఆరనిదయ్యింది. ఆశ, ఆవేదన, ఆరాటం అన్నీ మట్టిలో కలిసాయి. యేడ్చిన ఆమెకళ్ళు....సెలయేరులైనాయి. అవీ ఎండి పోయాయి ! మండిన ఆమె గుండెల్లో మమతానుబంధాలు...కాలి బూడి దయ్యాయి !

ఇలా కాలిపోయిన బతుకుతోటి సూర్యకుమారి ఊరు మారింది. ఉనికి మారింది. మనిషి మారింది. మాట తీరూ మారింది. సూర్యంగా, సూర్యమమ్మగా, ఆఖరికి సూరమ్మగా మారింది. వంట మనిషిగా, పని మనిషిగా, దిక్కులేని ముసలిదానిగా మూలుగుతున్న సూరమ్మకి ఒంటిమీద గల చిరిగిన చీర; గుడిసెలోని అంచులేని కంచుగిన్నె.

గతంలోకి వెళ్ళిన సూరమ్మ—తాలూకాఫీసు చెట్టు మొదలున తుఫానుగాలికి దెబ్బతిన్న పక్షిలా కూలబడింది !

ఎంత సేపటికో, తాలూకాఫీసు భవంతి ముఖద్వారంలోంచి బయటికి వస్తూ, కర్ణం పెద్ద గొంతుతో చెట్టు మొదలునా, టీ కొట్ల వద్దా వున్న— తాను తీసుకొచ్చిన పెన్షన్ దరఖాస్తు దారులందరినీ.

"రాండి ! రాండొరే మనోళ్లూ ! అయిపోయింది...మీకు పెన్షన్ శాంక్షనయిపోయింది. రండి, రండి...ఆర్డర్లు తీసుకుందురు"

అని పిల్చి—

"ఇదిగోరే మనోళ్లూ ! అల్లా చెట్టు మొదలు కాడవుంటాది సూరమ్మ ! పాపం, ఊష్ట మొచ్చి చేరబడింది. కొంచెం లేపి, తీసుకు రండి...." అని గూడా కేకేసాడు.

కానీ, అప్పటికే సూరమ్మ యే పిలుపుకీ అందని దూరతీరాలను చేరుకుంది. సూరమ్మా—అని కుదిపి, పిలిచిన వారి చేతులమీద కట్టెలాగా వాలిపోయింది ! యే ఆకాశకుసుమాలా అక్కర్లేని స్థితిలోకి వెళ్ళి పోయింది !

కరణం కంగారుపడి పోయాడు. తాలూకాఫీసు కలకలం చెంది పోయింది. చివరికెవరో అధికారి.

"తియ్యండి, తియ్యండి శవాన్నికక్కడ్నుండి"—

అని కోపించారు గూడా !

అవును, తాలూకా కార్యాలయంలో శవాలుండరాదుగా మరి !

★